


## బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే
# పాలేరుకు మోక్షం

- కాంగ్రెస్ వాళ్లు రైతుబంధు బంద్ చేస్తారట..
- 24 గంటల కరెంట్‌ను 3 గంటలు చేస్తరట..
- బూటకపు, మాయ మాటలు నమ్మి మోసపోవద్దు..
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

### ఇది నిజం కాదా?

బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే పాలేరు నియోజకవర్గానికి మోక్షం లభించిందని సీఎం కేసీఆర్ అన్నారు. నిన్నమొన్నటి దాకా కేసీఆర్ వల్ల మోక్షం వచ్చిందని మాట్లాడిన నాలుకులు.. నరం లేని నాలుక కాబట్టి వారే ఉల్టా మాట్లాడుతున్నారు. నరం లేని నాలుక మారొచ్చు కానీ, సత్యం మారదు. నిజం నిజం లాగే ఉంటుంది. నిజం నిప్పులాంటింది కదా? ఎవరి వల్ల పాలేరుకు మోక్షం వచ్చిందో మీకు అందరికీ తెలుసు అని కేసీఆర్ అన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ఏర్పాటు కోసం 24 ఏండ్ల క్రితం ఈ జెండా ఎత్తి, ఉద్యమాన్ని పిడికెడు మందితో ప్రారంభించుకున్నాం అని కేసీఆర్ అన్నారు. ఉద్యమ ప్రారంభంలో చాలా అవమానాలు, అవహేళన చేశారు. తెలంగాణ ఎట్ల వస్తది.. సాధ్యం కాదు.. కేసీఆర్ బక్క పలచనోడు ఎవడో పిసికి చంపేస్తడు అని మాట్లాడారు. కానీ, 14. 15ఏండ్లు పోరాటం తర్వాత యావత్ తెలంగాణ ఒక ఉప్పెన అయి కదిలేతే దేశ రాజకీయ పరిస్థితి తలవంచి తెలంగాణ ఇచ్చింది అన్నారు.

**అలుపెరగని పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్నాం..**

కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తే ఆరోజు నేనే ''కేసీఆర్ శవయాత్రనా.. తెలంగాణ జైత్రయాత్రనా అని ఆమరణ దీక్ష చేపట్టాను'' అని కేసీఆర్ ఉద్ఘాటించారు. ఆమరణ దీక్షకు పూనుకుంటే తనను అరెస్టు చేసి ఇదే ఖమ్మం జైల్లో పెట్టారు. అనేక మోసాలు చేశారు. మాటలతో నమ్మించారు. అన్నింటిని అధిగమించి అలుపెరగని పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్నాం అని సీఎం స్పష్టం చేశారు.

**పాలేరులో 40 ఏండ్లు కరువు కాటకాలు..**

భక్తరామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభం చేసిన రోజు మన మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి.. ప్రత్యేకించి ఆయన వచ్చారు. పాలేరుకు మీరు ఎందుకు వస్తున్నారంటే నాది కూడా పాలేరు నియోజకవర్గమే.. 45 ఏండ్లలో 40 ఏండ్లు కరువు కాటకాలకు గురైంది. ఇవాళ మీరు నీళ్లు అందిస్తున్నారు. సంతోషమైందని వచ్చానని మహేందర్ రెడ్డి తెలిపారని కేసీఆర్ గుర్తు చేశారు.

**పాలేరుకు మంచినీళ్లు ఇవ్వలేదు..**

మీ అందర్నీ కోరేది ఒక్కటే మాట. బీఆర్ఎస్ రాక ముందు ఈ రాష్ట్రంలో చాలా పార్టీలు రాజ్యం చేశాయి అని కేసీఆర్ అన్నారు. కొన్ని మంచినీళ్లు ఇవ్వాలన్న ఆలోచన చేయలేదు. పాలేరుకు మోక్షం లభించందంటే బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే. భక్తరామదాసు పూర్తి చేసి నీళ్లు ఇచ్చాం. ఈ విషయం మీ అందరికీ తెలుసు. వాగుల మీద చెక్ డ్యాంలు కట్టుకున్నాం. ఎండిపోయిన పాలేరు చెరువులు నిండుగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

**ఉపేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉండటం మీ అదృష్టం..**

ఉపేందర్ రెడ్డి ఉపన్యాసం విన్నాను.. అది ఉపన్యాసం లాగా లేదు. ఇంటి మనషులతో మాట్లాడినట్లు ఉంది. నా సెల్ ఫోన్ నంబర్ మీ దగ్గర ఉందా? అని అడిగారు. ఇది నాయకత్వ లక్షణం. ప్రజల్లో కలిసిపోయి మాట్లాడే నాయకులు చాలా తక్కువగా ఉంటారు. ఉపేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా మీకు ఉండటం అదృష్టం అని కేసీఆర్ అన్నారు.

# ఎన్నాళ్లు.. ఈ కన్నీళ్లు..

- పరిహారం, పునరావాసం.. ఓ ప్రహసనం
- అన్నమయ్య డ్యామ్ బాధితుల కడగండ్లు
- ఒకప్పుడు పాడిపంటలు.. ఇప్పుడు కష్టనష్టాలు
- అమలుకాని సీఎం జగన్ హామీలు
- బ్యాంకర్ల నుంచి నిత్యం వేధింపులు
- మారటోరియానికి నోచుకోని బాధితులు



## గుడారాలలోనే జీవితాలు

**అన్నమయ్య జిల్లా, ప్రభన్యూస్ బ్యూరో:** అన్నమయ్య డ్యాం తెగిపోయి రెండేళ్లు కావస్తోంది. కానీ అక్కడ పునరావాస కార్యక్రమాలు చూస్తే పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. అన్నమయ్య డ్యాం అర్ధరాత్రి తెగిపోవడంతో అక్కడ జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసిన నాధుడే లేడు. ఆ సంఘటన ప్రపంచాన్ని మొత్తం కలచివేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆ ప్రాంతాలకు వెళ్లి బాధితులకు నేరుగా గట్టి భరోసా ఇచ్చారు. మూడు నెలల్లో బాధితులకు పక్కా ఇళ్లు నిర్మించి తాళాలు చేతికిస్తామని గట్టి నమ్మకం చెప్పాడు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ వరద బాధిత గ్రామాలలో సందర్శించి నెలలోపు ఊరట కల్పిస్తానని ఆశలు చెప్పారు. సీఎం హామీలు.. కలెక్టర్ చెప్పిన ఆశలు.. అక్కడ కొండెక్కడంతో వరద బాధితుల కష్టాలు వర్ణనాతీతం.



**ఆ ఊళ్ల ఆనవాళ్లేవీ...**

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో ఇసుకతో కూడిపోయిన ఆ పరివాహక గ్రామాల ఆనవాళ్లుగా కూడా కనపడడం లేదు. ఇప్పటికీ అదే పరిస్థితి. పాలకుల నిర్లక్ష్యానికి ఇంతకంటే ఉదాహరణ అక్కర్లేదు. అధికారుల అలసత్వానికి అక్కడి పరిస్థితి చూస్తే చాలు. అంతకంటే ఆధారం అవసరం లేదు. ఏడు దశాబ్దాలు దాటిన ప్రజాస్వామ్య సమాజంలో విపత్తులకు బలైపోయిన గ్రామాలు కోలుకోవడానికి రెండేళ్ల సమయం సరిపోలేదు. అన్నమయ్య డ్యాం బాధిత గ్రామాల ప్రజల కష్టాలకు కన్నీళ్ళకు ఇంకా ఎన్నాళ్ళు ఎన్నేళ్లో అర్థం కావడం లేదు .


### నెలలో ఇల్లిస్తామని...



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నమయ్య డ్యాం తెగిపోయిన తరువాత సుమారు 15 రోజులకు 2021 డిసెంబర్ మూడవ తేదీన వరద ప్రాంతాలను సందర్శించారు. ముఖ్యమంత్రి ప్రత్యక్షమవడంతో బాధితులంతా తమ గోడు వెళ్లబోసుకున్నారు. దానికి చలించిన జగన్ మూడు నెలల్లో బాధితులకు పక్కా గృహాలు నిర్మించి తాళాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కానీ రెండేళ్ల అవుతున్నా బాధితులు మాత్రం తాత్కాలికంగా వేసుకున్న టెంట్లు, పూరి గుడిసెలు మారలేదు. అదే రోజున సీఎం జగన్.. తెగిపోయిన పింఛా అన్నమయ్య ప్రాజెక్టులను రీడిజైన్తో మళ్లీ పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలు ఏమ య్యాయో కూడా ఇప్పటికీ తెలియదు. ఒక హెక్టారుకు 12,500 రూపాయలను ఇసుకమేటలు తొలగించడానికి మంజూరు చేస్తున్నానని సీఎం హామీ ఇచ్చారు. కానీ వరద బాధిత గ్రామాల్లో ఏడాదికి రెండు పంటలు పండే పొలాలు ఇసుక దిబ్బలతో ఎడారిని తలపిస్తున్నాయి. ఆ మేటలను తొలగించడానికి ఎకరాకు లక్ష రూపా యలకు పైగా ఖర్చు అవుతుందని ప్రభుత్వం ఆరు వేల రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుం దని బాధితులు లబోదిబోమంటున్నారు. డ్వాక్రా గ్రూపులకు రుణాల చెల్లింపు విషయంలో ఒక సంవత్సరం మారిటోరియం ప్రకటిస్తానని సీఎం చెప్పినా ఒక నెల తరువాత నుంచే బ్యాంకర్లు వేధింపులకు పాల్పడడం ప్రారంభించారు. వరదల్లో గల్లంతయిన వేలాది పశువుల న ష్టాల ను పూడ్చడానికి పశుసంవర్ధక శాఖ ద్వారా పశుగణన చేయించి రైతులకు తిరిగి పశువులను పంపిణీ చేస్తానని సీఎం జగన్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. 60 మంది డిప్యూటీ కలెక్టర్లతో వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేస్తామని చెప్పినా ఆ వాగ్దానమూ నెరవేరనే లేదు. వరద బాధిత గ్రామాలైన పులపత్తూరు, అరుంధతివాడ, హరిజనవాడ, వరద బాధితులు ఇప్పటికీ తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడారాల్లోనే మగ్గుతున్నారు, మూగజీవాలను పోగొట్టుకున్న రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూసి చూసి ఆశ వదులుకున్నారు. విపత్తులతో ఏ ప్రాంతమైనా చిన్నాభిన్నమై చితికిపోతే ఆదుకునే విధానం ఇదేనా అంటూ పలువురు విమర్శిస్తున్నారు. డ్యామ్ తెగిపోయిన మొదటి రోజు నుంచి ఇప్పటిదాకా కొన్ని రాజకీయ పార్టీలు నాయకులు నిత్యం సందర్శిస్తూనే కోట్ల రూపాయల సాయం అందిస్తూనే ఉన్నారు. కానీ అసలైన వరద బాధితులకు శాశ్వత పరిష్కారాలు ఇంకా దొరకనే లేదు.

### శాపంగా మారిన అన్నమయ్య డ్యామ్..

రెండేళ్ల క్రితం తెగిపోయిన అన్నమయ్య డ్యాం రాజంపేట పాలకులకు శాపంగా మారనుందా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రిని మెప్పించి అన్నమయ్య డ్యాం పరివాహక ప్రాంత గ్రామాలను వీలైనంత త్వరగా పునరుద్ధరింపజేసే విషయంలో రాజంపేట ప్రజాప్రతినిధులు ఘోర విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా తక్షణ సాయం అందించడంలో గాని బాధితులకు పక్కా ఇల్లు ఇసుకమేటలతో నిండిన పొలాలు పునరావాసాలు లాంటివి అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని అభిప్రాయాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో ఈ అంశం ప్రభావితం చూపుతుందని భావిస్తున్నారు.



## రైతుల జీవితాలతో
# చెలగాటం ఆడొద్దు

- రైతుబంధు ఎన్నికల కోసం కాదు
- వందేండ్ల వయసు దాటిన కాంగ్రెస్ పార్టీకి పరిణితి లేదు
- వనపర్తిలో మీడియా మీట్‌లో మంత్రి నిరంజన్‌రెడ్డి



రైతుబంధు ఎన్నికల కోసం కాదన్నారు మంత్రి నిరంజన్ రెడ్డి. రాజకీయాల కోసం రైతుల జీవితాలతో చెలగాటం ఆడతారా..!. రాజకీయాల కోసం రైతుబంధు వద్దని కాంగ్రెస్ ఎలా చెబుతుందని ప్రశ్నించారు. వనపర్తి జిల్లాలోని మంత్రి నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ల వయసు దాటినా కాంగ్రెస్ పార్టీకి రాజకీయ పరిణతి లేదు. రాజకీయ అవలక్షణాలు వదిలించుకోవడం లేదు. సుధీర్ఘ చరిత్ర ఉన్న పార్టీ అధ్వాన్నస్థితికి చేరుకుంది. ప్రజల అంశాల మీద ఎన్నికలు గెలవాలి .. అడ్డుపుల్లలు వేసి లబ్ది పొందాలనుకోవడం రాజకీయం ఎలా అవుతుంది ?. రైతుబంధు ఎన్నికల కోసం కాదు.. కామన్ సెన్స్ లేని కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.

**రూ. 72,815 కోట్లు రైతుల ఖాతాలలో జమ..**

వానాకాలం, యాసంగి పంట కాలాలకు రైతుబంధు అందజేస్తున్నామని తెలిపారు. మంత్రి నిరంజన్ రెడ్డి. ఇప్పటి వరకు 11 విడతల్లో రూ.72,815 కోట్లు రైతుల ఖాతాలలో జమచేశామన్నారు. ప్రతి సీజన్ లో ఎకరాల వారీగా రైతుబంధు జమ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో 92.5 శాతం భూమి సన్న, చిన్నకారు రైతుల చేతుల్లోనే ఉందన్నారు మంత్రి నిరంజన్ రెడ్డి. ఏడు వేల కొనుగోలు కేంద్రాలు గ్రామాల్లో పెట్టి రైతులకు రవాణ ఖర్చు లేకుండా తెలంగాణ ప్రభుత్వం కల్లాల దగ్గర వరి ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. వానాకాలం వరి ధాన్యం కూడా కొనవద్దని కాంగ్రెస్ పార్టీ చెప్పదలుచుకున్నదా ? దమ్ముంటే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**నడుస్తున్న పథకాలకు నిబంధనలు వర్తించవు..**

ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక కొత్త పథకాలు, కొత్త ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఉండవు. అప్పటికే నడుస్తున్న పథకాలకు వర్తించదని ఎన్నికల కమీషన్ స్పష్టంగా నిబంధనల్లో చెప్పిందన్నారు మంత్రి నిరంజన్ రెడ్డి. రైతుబంధు వద్దని కాంగ్రెస్ పార్టీ రాసిన లేఖను తెలంగాణ రైతాంగం అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ నేత ఒకరు మూడు గంటల కరెంట్ చాలు అంటారు. కర్ణాటకలో ఎన్నికల హామీలు నెరవేర్చలేక ఐదు గంటలకన్నా ఎక్కువ కరెంటు ఇవ్వలేమని అక్కడ కరెంట్ మంత్రి తేల్చిచెప్పారన్నారు. కర్ణాటక రైతులు తెలంగాణకు వచ్చి కాంగ్రెస్ ను నమ్మి మోసపోయాం .. కాంగ్రెస్ పార్టీకి మీరు మోసపోవద్దని తెలంగాణకు వచ్చి చెప్పిపోతున్నారని చెప్పారు. తెలంగాణ రైతాంగం బాగుపడడం కాంగ్రెస్ కు ఇష్టం లేదని అన్నారు మంత్రి నిరంజన్ రెడ్డి.